

ముందు ప్రణాళికే సాగుకు మందు
వానాకాలం సాగు మరో రెండునెలల్లో ప్రారంభం కానుంది. మే మూడో వారం నుంచే రైతులు దుక్కి దున్నడం, చేను చదును చేయడం, మెదళ్లు ఏరికా ల్చడం తదితర పనులు చేస్తారు.
8లో▸

రంజాన్ వేళలు
ఇఫ్తార్ శని సా :6:28 | సహర్ ఆది ఉ : 4:53

వాతావరణం
గరిష్టం/కనిష్టం 35.0 /24.0
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఆగ్నేయం దిశగా గాలులు వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి.

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్ష కేంద్రంలో కలెక్టర్ తనిఖీ


తనిఖీ చేస్తున్న కలెక్టర్, డీఐఈవో

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ సంతోష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం మంచిర్యాల అల్ఫోర్స్ కళాశాల పరీక్ష కేంద్రంలో సౌకర్యాలపై ఆరా తీశారు. సీసీ కెమెరాల ఏర్పాటు, విద్యార్థుల తాగునీటి సౌకర్యంపై పరిశీలించారు. ప్రశాంతంగా పరీక్షలు సాగేలా చూడాలని అధికారులకు సూచించారు.

175 మంది గైర్హాజర్
ఇంటర్ ద్వితీయ పరీక్షలకు 5,330 మందికి గాను 5,155 మంది విద్యార్థులు హాజరు కాగా 175 మంది గైర్హాజరయ్యారు. మ్యాథ్స్, జువాలజీ, హిస్టరీ పరీక్షలకు జనరల్ విద్యార్థులు 4,170మందికి గాను 4,047 హాజరుకాగా 123 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1,160 మందికి గాను 1,108 మంది హాజరు కాగా 52 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో శైలజ తెలిపారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుకండి


శిబిరంలో పాల్గొన్న అదనపు కలెక్టర్

కోటపల్లి: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి అన్నారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకోసం శుక్రవారం కోటపల్లిలో రెవెన్యూ శాఖ, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రేషన్ డీలర్లు రక్తదానం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో శేషాద్రి, ఎంపీడీవో భాస్కర్, ఎంపీపీ మంత్రిసురేఖ, సర్పంచ్ రాగం రాజక్క, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి
కోటపల్లి: పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి అన్నారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా మండల స్థాయిలో 19 పంచాయతీలకు ఉత్తమ పంచాయతీ అవార్డులు అందజేశారు.

అక్రమ కేసులపై మౌన దీక్ష


మౌన దీక్షలో కాంగ్రెస్ నాయకులు


మంచిర్యాలఅగ్రికల్చర్: అక్రమ కేసులు బనాయించి జైలు పాలు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను నిరసిస్తూ మంచిర్యాల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద మౌన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాహుల్‌గాంధీని జైలుకు పంపాలనే ఉద్దేశ్యంతో అక్రమ కేసులు బనాయిస్తూ అణగదొక్కుతున్నారని మండిపడ్డారు. రాహుల్‌గాంధీ ప్రజల కోసం చేస్తున్న పోరాటాలకు సంపూర్ణ మద్దతు లభిస్తుందని ఓర్వలేకనే కేసులు పెడుతూ అడ్డుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పూదరి తిరుపతి, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ ఆకస్మిక పర్యటన


శిబిరాన్ని పరిశీలిస్తున్న రాహుల్

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శుక్రవారం ఆకస్మికంగా పర్యటించారు. కంటి వెలుగు శిబిరాలను సందర్శించి పరీక్షల తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. కాంట్రాక్టర్ బస్తీలో పారిశుధ్య పనులు పరిశీలించారు. చెత్తాచెదారం లేకుండా చర్యలు తీసుకోవడంతోపాటు మురికి నీటి కాలువల్లో మురికి నీరు నిల్వకుండా చూడాలని మున్సి పల్ అధికారులను ఆదేశించారు. జీఓ నెంబర్ 76 ప్రకారం ఇళ్ల పట్టాల కోసం ప్రజలకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ కుమారస్వామి, కమిషనర్ వెంకటేష్‌కు సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో ఆస్తిపన్ను వసూలుపై అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.

క్వార్టర్లలో కార్మికేతరులు !


మందమర్రి పట్టణం సెకండ్ జోన్ ఏరియాలోని సింగరేణి క్వార్టర్లు

మందమర్రిలో సింగరేణి రిటైర్డు ఉద్యోగి ఆధీనంలో రెండు క్వార్టర్లు, అతడి మిత్రుడి ఆధీనంలో మరో రెండు క్వార్టర్లు ఉన్నాయి. ఏడాదికి రూ.లక్షన్నర చొప్పున వేరే వ్యక్తులకు అద్దెకు ఇస్తూ వాళ్లు మంచిర్యాల పట్టణంలో నివాసం ఉంటున్నారు. వీరే కాదు మందమర్రి పట్టణంలో దాదాపు వెయ్యి మంది వరకు అనధికారికంగా ఆక్రమణల్లో ఉన్నట్లు అంచనా.

అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు క్వార్టర్‌ను తన ఆక్రమణలోకి తీసుకున్నాడు. క్వార్టర్ ఖాళీ చేయమని చెబితే ససేమిరా అంటున్నాడు. ఒక దశలో అలాట్ అయిన కార్మికుడు సైతం అతను ఖాళీ చేయడం లేదని చెబితే అధికారులే వేరే క్వార్టరు ఇచ్చారు. ఇలా శ్రీరాంపూర్ నుంచి మాదారంటౌన్‌షిప్ వరకు వందలాది సింగరేణి క్వార్టర్లు అనధికారికంగా ఆక్రమణల పాలవుతున్నాయి. ఆక్రమణకు గురి కాకుండా ఎస్టేట్, సెక్యూరిటీ విభాగాలు చర్యలు తీసుకుంటున్నా కబ్జాలు ఆగడం లేదు.

- గని కార్మికుల కంటే వారే అధికం
- వందలాది చోట్ల అనధికార ఆక్రమణలు
- అద్దెకు ఇస్తూ రూ.లక్షలు పొందుతున్న వైనం
- పట్టాలు ఇస్తారనే ఆశతో పెరుగుతున్న కబ్జాలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సింగరేణి కార్మికుల నివాసాల కోసం కేటాయించిన క్వార్టర్లు ఆక్రమణలకు గురవుతున్నాయి. రోజు రోజుకు కంపెనీలో పని చేసే కార్మికుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. కార్మికుల కంటే కార్మికేతరులే అధికంగా క్వార్టర్లలో నివాసం ఉంటున్నారు. కార్మికుల నివాసాలకు ఇబ్బంది కలుగొద్దని సంస్థ స్వయంగా క్వార్టర్లు నిర్మించి స్థాయిని బట్టి కేటాయిస్తోంది. కొత్తగా విధుల్లో చేరిన కార్మికులకు వెంటనే క్వార్టర్ అలాట్ కావాలంటే కష్టతరంగా మారింది. ప్రస్తుతం వేలాది క్వార్టర్లు కార్మికేతరుల చేతుల్లో ఉన్నాయి. వీటిలో పోలీసు, రెవెన్యూ, అటవీ ఇతరత్రా అధికారులకు సింగరేణి క్వార్టర్లు కేటాయిస్తూ వస్తోంది. కొన్ని చోట్ల కార్మికుల పేరుతో అలాట్ ఉండి.. వేరే వారికి అద్దెకు ఇస్తున్నారు.

పెరుగుతున్న ఆక్రమణలు
సింగరేణి స్థలాల్లో ఇళ్లు కట్టుకున్న వారికి ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేసి యాజమాన్య హక్కులు ఇస్తోంది. జీవో నంబరు 76 జారీ చేసింది. నస్పూర్, శ్రీరాంపూర్, రామకృష్ణాపూర్‌లో పట్టాలు పంపిణీ చేశారు. మందమర్రి ఏజెన్సీ పరిధిలో ఉంది. బెల్లంపల్లిలో ఇంకా ఇళ్ల పట్టాల పంపిణీ ప్రారంభం కాలేదు. తాండూర్ మండలం మాదారం టౌన్‌షిప్ పరిధిలోనూ కంపెనీ క్వార్టర్లు చాలాచోట్ల నిరుపయోగంగా ఉన్నాయి. గతంలో కార్మికులతో కళకళలాడిన క్వార్టర్లు ఇప్పుడు ఖాళీగా మారాయి. కొన్ని శిథిలావస్థకు చేరాయి. బెల్లంపల్లి, మందమర్రి, ఆర్కేపీ పరిధిలో నిత్యం క్వార్టర్లు, సింగరేణి కబ్జాల వివాదాలు, పోలీసుస్టేషన్లలో కేసుల నమోదు, గొడవలు జరుగుతున్నాయి. దీంతో నిరుపేదలకు ఇవ్వాలనే డిమాండ్లు ఉన్నాయి. శిథిలావస్థకు చేరిన క్వార్టర్లను సంస్థ నామమాత్రపు ధరతో పేదలకు ఇవ్వాలని కోరుతూ యాజమాన్యానికి వినతులు ఇచ్చారు.

సగానికిపైగా ఖాళీగానే..
ఉద్యోగ విరమణలు, కొత్త భూగర్భ గనుల ఏర్పాటు లేకపోవడంతో కార్మికుల భాగస్వామ్యం తగ్గుతోంది. చాలా చోట్ల క్వార్టర్లు నిరుపయోగంగా మారాయి. దాదాపు నాలుగు వేలకు పైగా క్వార్టర్లు ఉపయోగంలోనే లేవు. బెల్లంపల్లి, మాదారం, మందమర్రి, రామక్రిష్టాపూర్ తదితర ప్రాంతాల్లో అనేకం శిథిలావస్థకు చేరాయి. మున్సిపల్, గ్రామ పంచాతీయలకు మాత్రం ఆ భవనాలకు ఆస్తి పన్ను సంస్థ రూ.లక్షల్లో చెల్లిస్తోంది. ఖాళీ క్వార్టర్లకు సైతం పన్నులు చెల్లిస్తోంది. శ్రీరాంపూర్‌లో మాత్రం కార్మికులకు సరిపడా క్వార్టర్లు ఉండడంతో అనధికార ఆక్రమణలు తక్కువ. కొందరు కార్మికులే తమ పేరుతో కేటాయించిన క్వార్టర్లు ఇతరులకు అద్దెలకు ఒప్పందంతో ఇస్తున్నారు. వాళ్లు వేరే చోట్ల, సొంత ఇళ్లలో ఉంటున్నారు. వారికి సంస్థ హెచ్ఆర్ఏ చెల్లిస్తోంది. ఈ ఆక్రమణలపై ఫిర్యాదులు వస్తే విజిలెన్స్, సెక్యూరిటీ విభాగం తనిఖీలు చేస్తున్నారు. అనధికారికంగా ఉన్నట్లు తేలితే క్వార్టర్లను కొన్ని సార్లు బలవంతంగా ఖాళీ చేయించడం, విద్యుత్, నీటి సరఫరా ఆపేస్తున్నారు. తాత్కాలిక చర్యల కంటే ఆక్రమణలో ఉన్న క్వార్టర్లపై పకడ్బందీగా వ్యవహరించి అర్హులైన రిటైర్డ్ కార్మికులు, నిరుపేదలకు ఇవ్వాలని కోరుతున్నారు.

ప్రభుత్వ పథకాల లక్ష్యాలను సాధించాలి

- త్వరలో పోడు పట్టాల పంపిణీ
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి


కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వ సంక్షేమ, పథకాల లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కంటివెలుగు, ఆరోగ్య మహిళ, పట్టణాల్లో డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణం, పోడు భూములు, హరితహారం, ఇంటర్, పదో తరగతి పరీక్షల నిర్వహణ, సమీకృత జిల్లా శాఖ కార్యాలయాల సముదాయంపై కలెక్టర్, జిల్లా అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రిస్క్రిప్షన్ కళ్లద్దాలు లబ్ధిదారులకు ఇళ్లవద్దనే అందజేయాలని తెలిపారు. మహిళా ఆరోగ్య కేంద్రాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని చెప్పారు. భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం జారీ చేసిన జీవో 58, 59, 76, 118 ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని, జీవో 58కి సంబంధించి పెండింగ్ పట్టాలను మార్చి చివరి నాటికి పంపిణీ పూర్తి చేయాలని అన్నారు. డబుల్‌బెడ్రూం లబ్ధిదారుల ఎంపిక ఏప్రిల్ మొదటి వారం నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. పోడు పట్టాల పంపిణీ త్వరలో ప్రారంభమవుతుందని, పెండింగ్ దరఖాస్తులు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో జీవో 76 కింద పెండింగ్‌లో ఉన్న 3,554 దరఖాస్తుల్లో 1,079 మంది లబ్ధిదారులకు ఈ నెలాఖరు వరకు పట్టాలు అందజేస్తామని, మిగతా 2,275 దరఖాస్తుల్లో అర్హులను గుర్తించి ఏప్రిల్ మొదటి వారంలో అందజేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు డి.మధుసూదన్‌నాయక్, బి.రాహుల్, జిల్లా అటవీ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్, ట్రైనీ కలెక్టర్ పి.గౌతమి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రజల్లోకి తీసుకెళ్లాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బాల్క సుమన్, పక్కన నారదాసు లక్ష్మణ్‌రావు

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్
- నియోజకవర్గ సమావేశం

చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గంలో గత నాలుగేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంఆర్ఆర్ గార్డెన్‌లో పార్టీ జిల్లా ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణ్‌రావు అధ్యక్షతన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. 27 పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని తెలిపారు. మే మొదటి వారంలో విద్యార్థి, యువజన సమ్మేళనాలు, సోషల్‌మీడియా వారియర్స్ సమావేశాలు పూర్తి చేయాలని అన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రవీణ్ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గాంధారివనాన్ని సందర్శించిన ప్రభుత్వ విప్
రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్టలోని గాంధారివనాన్ని బాల్క సుమన్ శుక్రవారం సందర్శించారు. ఓఎస్‌డీ డీఎఫ్ఓ(అర్బన్ ఫారెస్ట్) కృష్ణ, డీఎఫ్ఓ శివ్ ఆశిష్‌సింగ్, ఎఫ్‌డీఓ వినయ్‌సాహులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వనంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ఇతర నిర్మాణాలపై చర్చించారు. క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, ఏఈ అచ్యుత్ పాల్గొన్నారు.


పట్టాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్, కలెక్టర్

కల నెరవేరింది..
రామకృష్ణాపూర్: సింగరేణి స్థలాల్లో ఇళ్లు కట్టుకుని ఉంటున్న వారి కల నెరవేరిందని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. రామకృష్ణాపూర్ పట్టణంలోని రాజీవ్‌చౌక్‌లో శుక్రవారం రాత్రి 5వ విడత ఇళ్ల పట్టాల పంపిణీలో భాగంగా 241 మందికి పట్టాలు అందజేశారు. కలెక్టర్ బాదావత్ సంతోష్, టీబీజీకేఎస్ నేత కెంగర్ల మల్లయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'సింగరేణి ఉద్యోగ నియామకాలపై విచారణ జరపాలి'


మాట్లాడుతున్న రఘునాథ్ వెరబెల్లి

పాతమంచిర్యాల: సింగరేణి సంస్థలో గతంలో నిర్వహించిన ఉద్యోగ నియామకాలపైనా విచారణ జరిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సింగరేణి సంస్థలో క్లర్క్ ఉద్యోగాల్లో పేపర్ లీకైనట్లు, అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయని అన్నారు. బీఆర్ఎస్, టీబీజీకేఎస్, ట్రేడ్ యూనియన్ నాయకులు, సింగరేణి జనరల్ మేనేజర్, డైరెక్టర్లను కూడా విచారించాలని పేర్కొన్నారు. సింగరేణి నియామకాల్లో అవకతవకలపై టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై కూడా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు ఆరుముల్ల పోశం, రజినిష్ జైన్, తులా ఆంజనేయులు, పట్టి వెంకటకృష్ణ, జోగుల శ్రీదేవి, బొద్దున మల్లేశ్, తోట మల్లికార్జున్, అమిరిశెట్టి రాజు, గాజుల ప్రభాకర్, ఆకుల సంతోష్, మేరడిగోండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు, సప్లిమెంటరీ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ యూఎస్‌పీసీ(ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ) ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు రామన్న, రాజవేణు మాట్లాడుతూ మార్చి 31 లోగా పీఆర్సీ బకాయిలు, సప్లిమెంటరీ వేతనాలు, డీఏ బకాయిలు, మెడికల్ రీయింబర్స్‌మెంటు, సెల వు వేతనాలు, పెన్షనరీ బకాయిలు, టీఎస్‌జీఎల్ఐ, తదితర పెండింగ్ బిల్లులు చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామని అన్నారు. అనంతరం జిల్లా ఖజానా శాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. అనంపల్లి రమేష్, మోతే జయకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణకు చర్యలు

- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్


ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో క్షయ వ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. శుక్రవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినం సందర్భంగా స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే దివాకర్‌రావు, డీఎంహెచ్‌వో సుబ్బ రాయుడు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సులేమాన్ జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ జి ల్లాలో 25 కేంద్రాల ద్వారా క్షయ వ్యాధి పరీక్షలు, చి కిత్స అందిస్తున్నామని, 183 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు, ప్రతీ రూ.500 చొప్పు న అందిస్తున్నామని తెలిపారు. వైద్యాధికారి డాక్టర్ నీరజ, ప్రోగ్రామ్ అధికారి ఫయాజ్, మాస్ మీ డియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఆరోగ్య కేంద్రం తనిఖీ
జైపూర్: మండలంలోని కుందారం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో మహిళా ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సంతో ష్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిష్టర్లు, ఆస్పత్రి పరిసరాలు పరిశీలించారు. మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కా ర్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ నీరజ, వైద్యాధికారి డాక్టర్ తిప్పారపు శ్రావ్య, ఎంపీపీ అనిల్ పాల్గొన్నారు.

కంటివెలుగు శిబిరం
నస్పూర్: పట్టణంలోని 11, 12వ వార్డుల్లో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను కలెక్టర్ సంతోష్ త నిఖీ చేశారు. వైద్యాధికారి డాక్టర్ నీరజ, మున్సిపల్ కమిషనర్ కమేశ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే పోలీసులకు గుర్తింపు

- రామగుండం పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరి
- 68మంది ఏఆర్ కానిస్టేబుళ్లకు పదోన్నతి


పదోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుళ్లను అభినందిస్తున్న సీపీ రెమా రాజేశ్వరి

మంచిర్యాలక్రైం: కష్టపడి పని చేసే పోలీసులకు గుర్తింపు లభిస్తుందని రామగుండం పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరి అన్నారు. రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఏఆర్ విభాగంలో కానిస్టేబుళ్లుగా పని చేస్తూ హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందిన 68మందిని కమిషనరేట్‌లో శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదోన్నతుల ద్వారా బాధ్యత మరింత పెరుగుతుందని అన్నారు. ప్రజల్లో పోలీసుశాఖకు నమ్మకం కలిగించే విధంగా విధులు నిర్వర్తించాలని సూ చించారు. ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని, యోగా, వాకింగ్, రన్నింగ్ చేస్తూ, తరచుగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ మోహన్, ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, ఆర్ఐలు మధుకర్, శ్రీధర్, విష్ణు ప్రసాద్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు బొర్లకుంట పోచలింగం, ఆర్ ఎస్సైలు రాజేష్, ప్రవీణ్, అనీల్, విశ్వజా పాల్గొన్నారు.

విశ్వనాథస్వామి ఆలయ హుండీ లెక్కింపు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల పట్టణంలోని విశ్వనాథస్వామి ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం ఆలయంలోని తొమ్మిది హుండీలను వేలాల మల్లన్నస్వామి ఆలయ ఈవో రమేష్ పర్యవేక్షణలో లెక్కింపు చేపట్టారు. ఆరు నెలలకు సంబంధించి హుండీల లెక్కింపుతో రూ.4,56,803 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ముక్తా రవి, మహిళా సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గైర్హాజర్ కార్మికులకు కౌన్సిలింగ్

శ్రీరాంపూర్: నిర్ణీత మస్టర్లు పూర్తిచేయని కార్మికులకు శుక్రవారం శ్రీరాంపూర్‌లోని ఆర్కే న్యూటెక్ గనిపై కౌన్సిలింగ్ నిర్వహించారు. ఏజెంట్ ఎన్.సత్యనారాయణ, మేనేజర్ స్వామిరాజు మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగి నిర్ణీత మస్టర్లు తప్పని సరిగా పూర్తిచేయాలన్నారు. లేనిపక్షంలో ఉద్యోగం నుంచి తొలగించబడుతారన్నారు. చిన్నచిన్న కారణాలతో ఉద్యోగానికి గైర్హాజరు కావడం సరికాదన్నారు. సింగరేణిలో ఉద్యోగం రావడం అదృష్టంగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ సీనియర్ పీవో ప్రకాశ్‌రావు, సంక్షేమాధికారి పాల్‌సృజన్, జీవో స్టాన్సీజోన్స్, టీబీజీకేఎస్ ప్రతినిధి బుస్స రమేశ్ పాల్గొన్నారు.

26న సీపీఐ ఉమ్మడి జిల్లా సమావేశం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: నస్పూర్‌కాలనీలోని సేవా భవన్‌లో ఈ నెల 26న సీపీఐ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై సమావేశంలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ప్రజలను చైతన్యవంతం చేయడానికి ఏప్రిల్ 14 నుంచి మే 10 వరకు చేపట్టనున్న 'గడప గడపకూ సీపీఐ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు జోగుల మల్లయ్య, పట్టణ కార్యదర్శి ఖలిందర్ అలీఖాన్, జిల్లా కౌన్సిల్ సభ్యులు దేవి పోచన్న, మిట్టపల్లి పౌలు, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని మోసం గ్రామానికి చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపారు. గ్రామానికి చెందిన మహిళ ఈ నెల 23న ఈజ్‌గాంలోని రైస్‌మిల్లులో వడ్లు పట్టించుకు వస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లింది. ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం మహిళ భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

హెచ్‌ఈవోకు ఉత్తమ అవార్డు

చెన్నూర్‌రూరల్: మండలంలోని అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీ హెచ్‌ఈవో జగదీశ్ ఉత్తమ అవార్డు అందుకున్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మంచిర్యాల మెడికల్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు, టీబీ ప్రోగ్రాం అధికారి ఫయాజ్ ఖాన్ చేతుల మీదుగా ప్రశంసపత్రం అందుకున్నారు. టీబీ నియంత్రణలో వందశాతం లక్ష్యం పూర్తి చేసినందుకుగానూ ఈ అవార్డు అందజేసినట్లు వారు పేర్కొన్నారు.

ముందు ప్రణాళికే... సాగుకు మందు



నెన్నెలలో వేసవి దుక్కులు దున్నుతున్న రైతు

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 15.50 లక్షల ఎకరాల్లో సాగు అంచనా
- వేసవి దుక్కులతో ఎంతోమేలు
- భూసార పరీక్షలు చేయించడం కీలకం
- అధిక ఎరువులతో అనర్థాలు

మంచిర్యాలఅగ్రికల్చర్: వానాకాలం సాగు మరో రెండు నెలల్లో ప్రారంభం కానుంది. మే మూడో వారం నుంచే రైతులు దుక్కి దున్నడం, చేలు చదును చేయడం, గతేడాది పంట మొదళ్లు ఏరికాల్చడం, తదితర పనులు మొదలుపెడుతారు. జూన్‌లో వర్షాలు ప్రారంభంకాగానే పంట రుణాలు, విత్తనాలు సమకూర్చుకోవడం సాగు పనులకు శ్రీకారం చుడుతారు. కానీ రైతులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా సాగుకు సిద్ధమైతే మంచి దిగుబడులు సాధించేందుకు దోహదపడనుందని వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త రాజశేఖర్ వివరిస్తున్నారు. పంట సాగుకు ముందు తీసుకోవాల్సిన పలు సూచనలు ఆయన మాటల్లోనే..

భూసార పరీక్షలు..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా వానాకాలంలో 15.50 లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగుకు అధికారులు అంచనా వేశారు. అయితే పంట సాగుకు ముందు భూసార పరీక్షలు అవసరం. భూసార విలువలను తెలుసుకుని కాలానుగుణంగా సాగు తీరును మార్చుకోవాలి. పరీక్షల ద్వారా భూమిలో సూక్ష్మస్థూల పోషకాల లోపాలు, మోతాదు పద్ధతిలో ఎరువుల వాడకంతో అదనపు ఖర్చులు తగ్గించుకునే వీలుంది. పొటాష్ వాడకాన్ని రైతులు కచ్చితంగా అలవర్చుకోవాలి. నూతన ఆధునిక యంత్రాల వినియోగం, సాంకేతిక పరిజ్ఞానం పాటించడంతో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చు.

ప్రణాళికాబద్ధంగా పెట్టుబడి...

పంట సాగుకు ముందు నుంచే ఖర్చులను లెక్కించుకోవాలి. పెట్టుబడులకు అనుగుణంగా విత్తనాలకు, కూలీలకు, ఎరువుల కొనుగోలుకు వ్యయాన్ని సమకూర్చుకోవాలి. బ్యాంకు రుణాలు పొందడానికి రైతులు ముందుగానే భూపత్రాలకు సంబంధించి పహాణి పత్రాలను సిద్ధం చేసుకోవాలి. బ్యాంకర్లు రెండు రకాలుగా నీటిపారుదల కింద ఎకరా పత్తికి రూ.40 నుంచి 45వేలు అందించనున్నారు. వర్షాధారం ద్వారా సాగయ్యే పత్తి, వరికి రూ. 35 నుంచి 45 వేల వరకు అందజేస్తారు.

పత్తి మొదళ్లను భూమిలో కలిపివేయడం..

పత్తి పంట దిగుబడి అనంతరం పత్తి చెట్ల మొదళ్లను కోసి కుప్పగా చేసి తగలబెడుతుంటారు. అలా కాకుండా రోటవేటర్ సాయంతో భూమిలో తేమ ఉన్నప్పుడు భూమిలో కలియదున్నాలి. రోటవేటర్ తర్వాత మల్ట్‌చెల్ట్ నాగలితో దున్నాలి. తర్వాత మరోసారి రోటవేటర్‌తో కలియదున్నాలి. ఈ విధంగా చేయడంతో భూమి సారవంతం పెరగడమే కాకుండా పత్తి పంటకు కావాల్సిన ఎరువులు తగ్గించవచ్చు.

వేసవి దుక్కులు కీలకం...

వానాకాలం సాగుకు ముందు నుంచే చేనును చదను చేసుకుని వేసవి తొలకరికి ముందే పంట విత్తుకోవడానికి సిద్ధం చేసుకోవాలి. తదితర పంటలు కోతల తర్వాత భూమిని వృథాగా వదిలి వేయకుండా వేసవిలో దుక్కి దున్నినట్లయితే చీడపీడలను కొంత వరకు నివారించవచ్చు. లోతుగా దున్నడంతో వరుసకు వరుసకు మధ్యలో వర్షపు నీరు నిలిచి లోపలికి చేరుతుంది. మొదటిసారి దుక్కులు దున్నిన తరువాత రెండోసారి దున్నే ముందు పశువుల ఎరువు, వర్మీ కంపోస్టు, చెరువు మట్టిని పొలంలో వెదజల్లుకుంటే పంట దిగుబడి సామర్థ్యం పెరుగుతుంది.

నాణ్యమైన విత్తనాలు

పంట సాగులో ప్రధానమైంది విత్తనాల ఎంపిక. పత్తిలో బీటీ విత్తనాలు దాదాపు 34 సంస్థలు వందల రకాలను మార్కెట్లో సిద్ధంగా ఉంచుతున్నాయి. పత్తి ప్యాకెట్ 450 గ్రాముల ధర రూ.960 తీసుకుంటున్నారు. ఆయా కంపెనీల డీలర్ల ద్వారా రైతులను ఆకట్టుకునే విధంగా ప్రచారం చేస్తున్నాయి. ఇందులో ఏ కంపెనీ నాణ్యమైన విత్తనాలు అందిస్తుందనే విషయంలో రైతులకు సరైన అవగాహన లేకుండా పోతోంది. దీంతో నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అలాగే రసాయనాల వాడకం అవసరం మేరకే వాడాలి.

సాలుకు అడ్డంగా దున్నడం

సాలుకు అడ్డంగా సేద్యం చేస్తే నీటి సంరక్షణ పెరుగుతుంది. విత్తనం వేయడం, అంతరకృషి చేయడంతో వర్షపు నీరు వాలుగ ఉన్న వైపు పరిగెత్తే అవకాశం ఉండదు. నీటి వేగం తగ్గి భూమిలోకి ఇంకడానికి అవకాశం కలుగుతుంది. ఎక్కువ నీరు భూమిలోనికి ఇంకడం వలన భూమిలో నిలువ పెరుగుతుంది.

సేంద్రియ ఎరువులు

సేంద్రియ ఎరువులు నేలలో కుళ్లి ఖనిజ పొరల్లో అభివృద్ధి చెంది పంటకు అవసమైన స్థూల, సూక్ష్మపోషకాలను అందిస్తాయి. నేల రసాయనిక, భౌతిక, జీవగుణాలపై ప్రభావం చూపి నేల సత్తువను, ఉత్పాదక శక్తిని పెంచుతాయి. సేంద్రియ ఎరువుల్లో పశువుల, కోళ్ల, గొర్రెల, వానాపాముల ఎరువును ఎకరానికి సుమారుగా 2- 4 టన్నుల వరకు వాడుకోవచ్చు. ఈ సేంద్రియ ఎరువులను విత్తడానికి 20-25 రోజుల ముందు వేసి భూమిలో కలియదున్నాలి. దీంతో భూమి గట్టి పడుకుండా గుల్లగా ఉంటుంది.

ఎస్‌డీఎల్ స్పేర్స్ కొరత తీర్చాలి



ఆర్కే 7గనిపై మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి

శ్రీరాంపూర్(మంచిర్యాల): ఆర్కే 7గనిలో ఎస్‌డీఎల్ యంత్రాల స్పేర్స్ కొరత వెంటనే తీర్చాలని గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం గనిపై 'అలయ్ బలయ్' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరచూ యంత్రాలు మొరాయిస్తుండడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. సర్ఫేస్‌లో ఫ్యాన్ వద్ద ఆపరేటర్లకు సరైన షెల్టర్ లేదన్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా చర్చల ప్రతినిధులు పెట్టం లక్ష్మణ్, వెంగళ కుమారస్వామి, పిట్ సెక్రటరీ మెండె వెంకటి, నాయకులు అశోక్, ప్రేంకుమార్, మోతె రాఘవరెడ్డి, మహిపాల్ రెడ్డి, పొగాకు రమేశ్, సారంగపాణి, మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఐకే1ఏ గనిపై 'అలయ్ బలయ్'



మాట్లాడుతున్న టీబీజీకేఎస్ నాయకులు

జైపూర్(చెన్నూర్): మండలంలోని ఇందారం ఐకే1ఏ గనిపై శుక్రవారం టీబీజీకేఎస్ నాయకులు అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ఉపాధ్యక్షులు ధీకొండ అన్నయ్య, మంద మల్లారెడ్డి, సింగరేణి చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్‌రెడ్డి కార్మికులను అడిగి సమస్యలు తెలుసున్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ డెప్యూటీ జనరల్ సెక్రటరీ అశోక్, జీఎం కమిటీ మెంబర్ కాశీరావు, పిట్ కార్యదర్శి గడ్డం మల్లయ్య, ఐకే ఓసీపీ కార్యదర్శి సాదుల సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన అతివేగం

- రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి
- యువకుడికి తీవ్రగాయాలు



సంఘటన స్థలంలో క్షతగాత్రులు

బెల్లంపల్లి: కోర్టు వాయిదాకు హాజరు కావడానికి కుమారుడితో కలిసి వచ్చిన ఓ వృద్ధుడు బైక్ ఢీకొని దుర్మరణం చెందిన ఘటన శుక్రవారం బెల్లంపల్లిలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ టి.శంకరయ్య తెలిపిన వివరాల ప్రకారం భీమిని మండలం మల్లిడి గ్రామానికి చెందిన కోట మాంతయ్య (60) కుమారుడు కోట సంతోష్‌కు సంబంధించిన కేసు బెల్లంపల్లి కోర్టులో నడుస్తోంది. కోర్టు ఆవరణలోకి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా ఏఎంసీ వైపునుంచి కాంటాచౌరస్తా వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో మాంతయ్యకు, బైక్ నడిపిన తాజ్‌బాబా అనే యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో వృద్ధుడు మృతి చెందాడు. తాజ్‌బాబాను మెరుగైన చికిత్సకోసం మంచిర్యాలకు రెఫర్ చేశారు. తాజ్‌బాబా అతివేగంగా బైక్ నడపడం వల్లనే ఈ దుర్ఘటన జరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ శంకరయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



ప్రేమ్‌సాగర్ (ఫైల్)

చెన్నూర్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం భీమారంకు చెందిన తగరం ప్రేమ్‌సాగర్ (22), అతని బంధువైన గాలిపల్లి కిరణ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై జయశంకర్ భూపాలపల్లికి వెళ్తుండగా లింగంపల్లి సమీపంలోని అర్బన్ పార్కు వద్దకు రాగానే చెన్నూర్ నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. ఘటనలో ప్రేమ్‌సాగర్ అక్కడికక్కడే మృతి చెందగా కిరణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కిరణ్‌ను మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. మృతుని సోదరుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇష్టంలేని పెళ్లి చేస్తున్నారని ఆత్మహత్య



మృతదేహానికి పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై

వాంకిడి(ఆసిఫాబాద్): కుటుంబ సభ్యులు తనకు ఇష్టంలేని పెళ్లి చేస్తున్నారని మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై డి.సాగర్ తెలిపిన వివరాల ప్రకారం బంబార గ్రామ పంచాయతీ పరిధిలోని రాజీవ్‌నగర్‌కు చెందిన నాయని పునేష్ (22)కు ఇటీవల రెబ్బెన మండలానికి చెందిన ఓ యువతితో వివాహం జరిపించాలని ఇరువురి కుటుంబ సభ్యులు నిశ్చయించారు. అయితే తమకు పెళ్లి ఇష్టంలేదని పునేష్ కుటుంబ సభ్యులకు తెలపడంతో మధ్యవర్తికి సమాచారం అందించారు. అయినా మరోసారి మాట్లాడుదామని యువతి తల్లిదండ్రులు ఈ నెల 27న వస్తున్నట్లు యువకుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పునేష్ గురువారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసిన అనంతరం బయటకు వెళ్లాడు. వ్యవసాయ పొలానికి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం మృతుని తండ్రి పోచన్న పంటచేలకు వెళ్లడంతో అక్కడ స్పృహలేకుండా పడి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న ఎస్సై సంఘటన స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించారు. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

హెచ్‌ఎంఎస్ పిట్ సెక్రటరీగా క్రాంతికుమార్

శ్రీరాంపూర్: హెచ్‌ఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా స్టోర్స్ పిట్ సెక్రటరీగా పల్లె క్రాంతికుమార్‌ను నియమించారు. ఈ మేరకు శుక్రవారం యూనియన్ కార్యాలయం వద్ద రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ నియామక పత్రం అందించారు. ఏరియా స్టోర్స్‌లో కార్మికుల సమస్యలపై యాజమాన్యంతో పోరాడాలని సూచించారు. కష్టపడి పనిచేసే వారికి యూనియన్‌లో గుర్తింపు ఉంటుందన్నారు. రాబోయే ఎన్నికల్లో యూనియన్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి ఉపాధ్యక్షుడు జీవన్ జోయల్, కార్యదరి తిప్పారపు సారయ్య, నాయకులు అనిల్‌రెడ్డి, గోళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

క్లర్క్ పోస్టులకు కౌన్సెలింగ్



వెబ్ కౌన్సెలింగ్‌లో పాల్గొన్న క్లర్క్‌లు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని ఎంవీటీసీలో క్లర్క్ (జూనియర్ అసిస్టెంట్) పోస్టులకు శుక్రవారం వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. శ్రీ రాంపూర్, మందమర్రి ఏరియాల్లో జూనియర్, సీనియర్ క్లర్క్‌లుగా పనిచేస్తున్న వారితో పాటు ఇటీవల ఇంటర్నల్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఎంపికైన వారికి పోస్టింగ్ ఇచ్చేందుకు కొత్తగూడెం నుంచి సింగరేణి వ్యాప్తంగా వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 65 మంది దరఖాస్తు చేసుకోగా 62 మంది హాజరయ్యారు. వారికి మెరిట్ ఆధారంగా పోస్టింగ్ ఇచ్చా రు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం త్యా గరాజు, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, వీటీసీ మేనేజర్ వెంకటరామారావు, ఎస్ఈ కిరణ్‌కుమార్, సీనియర్ పీవో దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏరియాలో...

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియా గోలేటి టౌన్‌షిప్‌లో గల జీఎం కార్యాలయంలో క్లరికల్ ఉద్యోగులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. సీనియారిటీ ప్రకారం ఏరియాల వారీగా బదిలీల ఆప్షన్‌లను ఎంచుకున్నారు. త్వరలోనే బదిలీ ప్రక్రియ పూర్తవుతుందని ఏరియా జీఎం దేవేందర్ తెలిపారు. ఎస్‌వోటూ జీఎం గుప్తా, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహారా, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

గోలేటిలో సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్‌షిప్‌లో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్వార్టర్ల కిటికీలు, తలుపులు ఊడిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మరమ్మతులు చేయాలని దరఖాస్తులు అందించి నెలలు గడుస్తున్నా సివిల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో దోమలు వృద్ధిచెంది కార్మికులు, కుటుంబ సభ్యులు రోగాల బారిన పడుతున్నారన్నారు. కార్మిక వాడల్లో పందులు, వీధి కుక్కల బెడద అధికంగా ఉందన్నారు. సమావేశంలో జీఎం కమిటీ సభ్యులు సమ్మయ్య, రవీందర్, ఆఫీస్ ఇన్‌చార్జి మహేందర్, నాయకులు కృష్ణ, కందుల తిరుపతి, కిరణ్, విద్యాసాగర్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

వాంకిడి: పేకాట ఆడుతూ పట్టుబడిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.సాగర్ తెలిపారు. మండలంలోని ఎనోలి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా నలుగురు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రూ.1,100 నగదు స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మాతా శిశు సంక్షేమానికి కృషి

- కలెక్టర్ బదావత్ సంతోష్



మాతా శిశు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

మంచిర్యాలఅగ్రికల్చర్: మాతా శిశు ఆరోగ్య కేంద్రం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తూ మాతా శిశువుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆస్పత్రిలోని పలు వార్డులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సాధారణ ప్రసవాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి నీరజ, ఆస్పత్రి పర్యవేక్షకులు హరిశ్చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో శుక్రవారం రిన్యూ పవర్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఐటీఐలో వివిధ కోర్సులు పూర్తి చేసిన 220 మంది అభ్యర్థులు మేళాకు హాజరుకాగా 78 మందిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చందర్, ట్రైనింగ్ ఆఫీసర్ రమేశ్, డీటీవోలు శ్రీధర్‌రాజు, హఫీజ్, ప్రకాశ్‌రావు, ఏటీవోలు రాజేందర్, షోయబ్, శశికుమార్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పట్టు పరిశ్రమకు తెలంగాణ అనుకూలం

- సెంట్రల్ సిల్క్ బోర్డు సభ్యురాలు డాక్టర్ భాగ్య

జనగామరూరల్: పట్టు పరిశ్రమకు తెలంగాణ నేలలు అనుకూలమని, ఈ పరిశ్రమపై రైతులు దృష్టి సారించాలని సెంట్రల్ సిల్క్ బోర్డ్ సభ్యురాలు డాక్టర్ భాగ్య అన్నారు. శుక్రవారం జనగామ మండలం పెంబర్తిలోని శివం ఫంక్షన్ హాల్‌లో ప్రాంతీయ పట్టు పరిశోధన కేంద్రం, సెంట్రల్ సిల్క్ బోర్డ్ ఆధ్వర్యంలో సిరిసిల్ల, సిద్దిపేట, భువనగిరి, ములుగు, మహబూబాబాద్, జనగామ, నల్లగొండ, సూర్యాపేట, నిర్మల్, మంచిర్యాల, వరంగల్, హనుమకొండ, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు చెందిన 300 మంది రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా డాక్టర్ భాగ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పట్టు పరిశ్రమల వల్ల ఎకరానికి రూ.3 నుంచి రూ.4 లక్షల ఆదాయం వస్తోందన్నారు. రాష్ట్రంలో 15,679 ఎకరాల్లో 6 వేలమందికి పైగా రైతులు మల్బరీ సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కువగా దిగుబడినిస్తున్న బైవోల్టిన్ పట్టు పురుగులను రైతులు పెంచుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. రైతులకు బిందుసేద్యం వసతి కల్పిస్తున్నారని, పట్టు పురుగుల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. జనగామ జిల్లాకు కేంద్రం మల్బరీ గుడ్ల ఉత్పత్తి కేంద్రాన్ని మంజూరు చేసిందన్నారు. సెంట్రల్ బోర్డు శాస్త్రవేత్తలు వినోద్ యాదవ్, మీనాక్షి, బీటీ శ్రీనివాస్, మొగిలి, హార్టికల్చర్ అధికా రి లత, వివిధ జిల్లాల అధికారులు, రైతులు పాల్గొన్నారు.



రాలిన మామిడికాయలు ఏరుతున్న రైతు



ఎగిరిపోయిన గెర్రెగూడ హనుమాన్ ఆలయ రేకులు

గాలివాన బీభత్సం

- సుమారు గంటపాటు కురిసిన వర్షం
- నేలరాలిన మామిడి కాయలు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలో శుక్రవారం గాలివాన బీభత్సాన్ని సృష్టించింది. పలుచోట్ల చెట్లు నేలకు ఒరిగాయి. రాస్పెల్లి గ్రామ పంచాయతీలోని గెర్రెగూడ శ్రీ హనుమాన్ ఆలయానికి చెందిన రేకులు గాలికి ఎగిరిపోయాయి. సుమారు గంటపాటు కురిసిన వర్షానికి ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. నజ్రూల్‌నగర్, ఈజ్‌గాం, మోసం, ఆరెగూడ గ్రామాల్లోని తోటల్లో మామిడి కాయలు నేలరాలాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.